క్లుప్తంగా

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



అలంపూర్ : పట్టణంలోని పలు వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని బీజేపీ, వివేకానంద యూత్ సభ్యులు కోరారు. మున్సిపల్ సిబ్బందికి బీజేపీ నాయకులు రంగస్వామి, బంగారు లక్ష్మణ్, వివేకానంద యూత్ సభ్యులు సంజీవ నాయుడు, రాఘవేంద్రలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా కుమ్మరివీధి, జంగం వీధిలో విద్యుత్ స్తంభాలకు దీపాలు లేక చీకట్లు కమ్మేసినట్లు ఉంటుందని పేర్కొన్నారు. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఆరు రోజుల పాటు నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని ప్రముఖ వేదపండితులు వెంకటశేషశర్మ తెలిపారు. మంగళవారం నుంచి జనవరి 5 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆత్మకూర్‌లో ఉత్సవమూర్తి విగ్రహాల ఊరేగింపు చేస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను కాపాడుకుందాం



అయిజ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఎర్త్ పైపులకు నీళ్లపోసి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురి కాకుండా కాపాడుకుందామని విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్‌తో నీళ్ల తీసుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ పైపులకు పోశారు. గ్రామ పంచాయతీ అధికారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్పీల ముందస్తు అరెస్టు

కేటీదొడ్డి: విద్యాశాఖలో పని చేస్తున్న సీఆర్పీలను క్రమబద్ధీకరించాలన్న నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడి చేస్తారన్న అనుమానంతో పోలీసులు సీఆర్పీలను ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ పని చేస్తున్న సీఆర్పీలు యుంగధర్, పాపయ్య, పీఈటీ రవిను స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు విచారించి పంపివేశారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కీలక విధులు నిర్వహిస్తున్న సీఆర్పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)ల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సీఆర్పీలను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఘనంగా వింటర్ ఫెస్ట్



అలంపూర్ : పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో వింటర్ ఫెస్ట్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకోని ప్రతి ఏడాది వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు తొలి రోజు ఇంగ్లీష్ నైట్ పేరుతో ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు సృజనాత్మకత, భాష నైపుణ్యం సంబంధించి సమాజాన్ని చైతన్యపరిచే నాటికలు, పాటలు, డ్యాన్సులు ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

గద్వాల క్రైం: జిల్లా కోర్టు సముదాయాలు తరలించే విషయంపై గద్వాల బార్ అసోసియేషన్ సభ్యుల నిరసన దీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం వివిధ పార్టీలు వారికి మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సభ్యులు రాఘురామిరెడ్డి, ఖాజమొయినుద్దీన్‌లు మాట్లాడారు. అన్ని వసతులు కలిగిన జిల్లా కేంద్రంలోని పీజేపీ క్యాంప్ ప్రభుత్వ స్థలంలో నూతన కోర్టు సముదాయాల కోసం స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలలో జాగ్రత్తలు పాటించాలి

మానవపాడు: నూతన సంవత్సర వేడుకల్లో మండల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించనున్నటలు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజలకు వేడుకలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన అప్రోచ్ రోడ్డు నిర్మాణం



ప్రమాదకరంగా నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్డు

- నిర్మించని రక్షణ గోడలు
- పొంచి ఉన్న ప్రమాదం
- గడువు ముగిసినా పూర్తి కాని పనులు

అయిజ: బ్రిడ్జిని నిర్మించే ముందు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా కాంట్రాక్టర్లు, అధికారులు చర్యలు చేపట్టాలి. వాహనాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు అవేమి పట్టించుకోవడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తై ఆరు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాలేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నత్తనడకన నిర్మాణ పనులు..

మున్సిపాలిటీలో పాత బస్టాండ్- కొత్త బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై 2023 జనవరిలో రూ. 7 కోట్ల నిధులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ నిర్వహించారు. ఎల్ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్ట్ దక్కించుకోగా 2023 జూలైలో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించారు. 2024 జూన్‌లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. అయితే ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. పెండింగ్ పనులు చాలా ఉన్నాయి.

పాటించని రోడ్డు భద్రత...

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. హైలెవల్ బ్రిడ్జికి రోడ్డు నిర్మించడంతో ఇరు పక్కలా లోతైన గుంత ఏర్పడుతుంది. రోడ్డు పైనుంచి వాహనాలు గుంతలో దూసుకుపోకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినప్పుడు ప్రమాద సూచికను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. ఇవేమి లేకుండా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.

రక్షణ గోడల నిర్మాణం ఊసేలేదు..

ఎత్తైన రోడ్డు నిర్మించినప్పుడు వాహనాలు కింద పడిపోకుండా ఉండేందుకు ఇరు వైపులా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంటుంది. అయితే ప్రణాళికలో రక్షణ గోడలకు సంబంధించిన పనులు చేర్చలేదు. దానివలన కాంట్రాక్టర్ వాటి నిర్మాణం చేపట్టడం లేదు. ఒప్పందం ప్రకారం రక్షణ గోడలకు బదులుగా గాడ్స్ స్టోన్‌లు నిర్మించాలని అధికారులు ప్రణాళిక చేసుకున్నారు. గాడ్స్ స్టోన్ మధ్యన ఖాళీ స్థలం ఉండడంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. అధికారులు రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

> **కనీస జాగ్రత్తలు పాటించడంలేదు**
>
> 
>
> రోడ్డు నిర్మించేటప్పుడు కాంట్రాక్టర్లు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. రోడ్డు నిర్మాణంలో ఉందని సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో ప్రమాద సూచికలు తెలిసేందుకు రేడియం స్టిక్కర్లు అతికించాలి. ఇవేమి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణం పనులు చేపట్టారు.
>
> – మల్లకంటి మహేష్, అయిజ

> **లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి..**
>
> 
>
> సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయకపోవడంతో పట్టణంలోని ప్రధాన రహదారి చీకటిగా ఉంటుంది. గ్రీనరీ ఏర్పాటు చేయకపోవడంతో కళాహీనంగా ఉంది. గతంలో నిర్మించిన బీటీ రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీతో పాటు సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై కూడా ఏర్పాటు చేయాలి.
>
> – మహబూబ్ బాషా, అయిజ

> **త్వరగా పూర్తి చేస్తాం..**
>
> ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కాలపరిమితికంటే ముందుగా నిర్మాణం పనులు పూర్తిచేయాలని గుత్తేదారులను కోరాం. అనేక కారణాల వలన నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు రివెట్‌మెంట్ రోడ్డు తవ్వడం వలన దాన్ని మళ్లీ నిర్మించాల్సి ఉంది. బీటీ రోడ్డు, గాడ్స్ స్టోన్స్ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. త్వరగా పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తాం.
>
> – అల్తాఫ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఆయకట్టుకు సాగునీరందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరందించాలని మండలంలోని వివిధ గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ఈ ఏడాది 37 వేల ఎకరాల ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని అధికారులు చెప్పారని కలెక్టర్‌తో వాపోయారు. అయిజ మండలంలో ఆర్డీఎస్ ఆయకట్టు ప్రాంతంలో వరి తప్పా ఆరుతడి పంటలు పండవని తెలిపారు. మార్చి ఆఖరి వరకు ఆర్డీఎస్ ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరారు. స్పందించిన కలెక్టర్ యాసంగి వరి సాగు పూర్తయ్యే వరకు సాగునీటిని విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు' జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ధరూరు : లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు అనే నినాదంతో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి మండల ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున కదిలి రావాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డ్యాం వెంకటన్న, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు చింతరేవుల ఆంజనేయులు, రాముడు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జిగా డప్పు స్వామి మాదిగను నియమించినట్లు తెలిపారు. ఆయన ఆదేశాను సారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటప్ప మాదిగ, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శంకర్ మాదిగ, సహాయ కార్యదర్శిగా ఆంజి, ఆంజనేయులు, ప్రచార కార్యదర్శిగా పరుశరాం, బుడ్డ పరుశ, సలహాదారుగా పెద్ద కర్రెన్న, గౌరవ అధ్యక్షుడిగా మార్లబీడు దేవదాసు మాదిగలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం

గద్వాల: సమాజం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం, మద్యం నియంత్రణ అంశాలపై న్యాహోం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి సునంద ప్రకటనలో తెలిపారు. ఇటీవల డ్రగ్స్ వినియోగం పెరిపోయిందన్నారు. డ్రగ్స్ బానిసలను డీ-అడిక్షన్ సెంటర్లలో చేర్పించేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో వెంకటేశ్వరి, సుజాత, కృష్ణయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ధరూరు : ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. సోమవారం మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో మూడు బృందాలు సర్వే నిర్వహించాయి. పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు ఏఈఓ స్వరూప తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, నియమాల ప్రకారం సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

శాంతినగర్ : సోమవతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూలెకల్ శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బూడిదపాడులో..

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు, అలంపూర్ చౌరస్తాలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గోమాతకు పూజలు..

శాంతినగర్ : సకల దేవతలు కొలువై ఉన్న గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే అని గోప్రచారక్ సేవా సమితి సభ్యులు అర్చకుడు వినయ్‌కౌశిల్ శర్మ, అభిషేక్ శర్మలు అన్నారు. శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవతి అమావాస్య పూజలు నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు..

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజ, అభిషేకం వంటి క్రతువులు నిర్వహించారు.

ధరూరు : మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంతో పాటు, పెద్ద చింతరేవుల, అల్వలపాడు, ధరూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు చేశారు.

కేటీదొడ్డి: మండల పరిధిలోని వెంకటాపురం శ్రీ పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

గట్టు : అమావాస్య సందర్భంగా గట్టులోని గండి ఆంజనేయస్వామి దేవాలయంలో పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మాచర్ల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

అమావాస్య ప్రత్యేక అన్నదానం..

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో అమావాస్య సందర్భంగా కె.మహేశ్వరమ్మ, రామాంజనేయులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శివాంజనేయస్వామి ఆలయంలో..

ఇటిక్యాల : మండల పరిధిలోని వావిలాల శివాంజనేయస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం తదితర క్రతువులు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ఇటిక్యాల శివాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బీచుపల్లిలో అభిషేకం చేస్తున్న భక్తులు

చదువుతో ఉత్తమ భవిష్యత్



తుమ్మలచెరువులో సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గట్టు : చదువుకుంటేనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని, బడిఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని ఎల్‌టీవీ మైండ్ ట్రీ, భవిష్యత్ భారత్ సంస్థ ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ రాజారాం బాలరాజ్ అన్నారు. సోమవారం ఇరు సంస్థల ఆధ్వర్యంలో పెంచికలపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లో 19 మంది పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో బాలరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బస్సు సౌకర్యం లేని పేద విద్యార్థులకు చదువుకునే వీలుగా సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఫిరోజ్, గోపాల్, ఉపాధ్యాయులు జయసింహాచారి, రమేష్, జ్యోతి, హోటల్ నర్సింహులు, వడ్ల వీరేష్, శివప్ప, నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ సమస్యలు పట్టించుకోని సీఎం



గద్వాలలో సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి విద్యా శాఖలోని సమస్యలు పట్టించుకోవడం లేదని వివిధ సంఘాల నాయకులు విమర్శించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు టీపీఆర్‌టీయూ, టీటీయూ ఉపాధ్యాయ సంఘాలు, బీఎస్పీ నాయకులు వేర్వేరుగా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోమవారం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, ఎస్ఓలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

గద్వాల: మానవపాడు మండలం పోతులపాడు, చెన్నిపాడు గ్రామ రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం మరమ్మతులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయా గ్రామస్తులతో కలిసి కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజగోపాల్, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, లక్ష్మణ్‌గౌడ్, మురళి, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కోర్టు సముదాయానికి పీజేపీ క్యాంపులోనే స్థలాన్ని కేటాయించాలని జిల్లా అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు అందజేశారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గట్టు : కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన తీరుకు నిరసనగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా మాట్లాడుతూ.. దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో దళిత సామాజిక వర్గానికి చెందిన హెచ్‌ఎం రాములుపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శాంతన్న, చంద్రు, నర్సింహులు, స్వామి పాల్గొన్నారు.

అంటరానితనం పాటిస్తే కఠిన చర్యలు



నేతువానిపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఐ నాగిరెడ్డి

మల్దకల్ : గ్రామాల్లో అంటరానితనం పాటించినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై ఈశ్వరయ్య, ఆర్ఐ నాగిరెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని నేతువానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రెండు గ్లాసుల పద్ధతి, ఆలయ ప్రవేశాలు అడ్డుకోవడంను నేరమన్నారు. అంటరానితనం పాటించడం వలన కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శుభవతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: అంటరానితనం అమానుషమని, అలాంటి వాటికి పాల్పడిన వారిపై కేసులు నమోదవుతాయని పంచాయతీ సెక్రటరీ వీరేష్ అన్నారు. పౌరహక్కులపై మాన్‌దొడ్డిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో చిన్నారుల ప్రతిభ



ఎర్రవల్లి: కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కూచిపూడిలో నిర్వహించిన బృంద నాట్యంలో ఎర్రవల్లి నటరాజ నాట్య వసంతం చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 3000 మంది నృత్యకారులతో నిర్వహించిన కూడిపూడి బృంద నాట్యంలో చిన్నారులు కీర్తి సోనియా, వెన్నెల, యక్షిత, సిరిచందన పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా చిన్నారులను నిర్వాహకులు, ముఖ్య అతిథులు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసినట్లు నటరాజ నాట్య వసంతం అకాడమీ నాట్య గురువు జ్యోతి తెలిపారు.

బాధితులకు ఫోన్లు అందజేత

ఎర్రవల్లి: కోదండాపురం పీఎస్ పరిధిలో ఇటీవల మొబైల్స్ పోగొట్టుకున్న ముగ్గురికి రికవరి చేసి మొబైల్స్ అందజేసినట్లు ఎస్సై స్వాతి సోమవారం తెలిపారు. సీఈఐఆర్ సాంకేతిక పరి/జ్ఞానంతో కనుగొన్నట్లు ఆమె పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఇటిక్యాల: మండల పరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన బతుకన్నకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కును సోమవారం బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు లబ్ధిదారుడి నివాసానికి చేరుకొని రూ.18,500 విలువ గల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

ఇటిక్యాల : పౌరహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలకు, యువతకు పౌర హక్కులపై తహసీల్దార్ అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం పౌర హక్కులని, వాటిని కాపాడి ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, కార్యదర్శి రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్నారు

అయిజ: ప్రభుత్వం నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాల ద్వారా కొందరు నిర్వాహకులు రైతులను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. సోమవారం ఉప్పల గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల పేరు చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. తూకం విషయంలో తేడాలున్నట్లు గుర్తించామన్నారు. అధికారులు చర్యలు తీసుకొని, కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నుంచి రైతుల డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఎర్రవల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోదండాపురంలో యువతకు సొంత ఖర్చులతో క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహనాయుడు, పుల్లారెడ్డి, తిరుపతి, శంకర్, ఆంజనేయులు, సత్య తదితరులు పాల్గొన్నారు.